

సోమవారం హైదరాబాద్ అంబర్‌పేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు



హైదరాబాద్ అంబర్‌పేట రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్



హుజూరాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, నమస్కరిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

# రాబందు కాంగ్రెస్‌ను తరిమికొట్టండి

▸ మొదటిపేజీ తరువాయి...

ఇప్పటికే మనం 11 సార్లు వేసుకున్నం. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు పడ్డయి. ఇదేం కొత్త ప్రోగ్రాం కాదు. ఎప్పటి నుంచో ఉన్నదే. మళ్లా నాటు వేసే టైం వచ్చింది కాబట్టి రైతుబంధుకు అవకాశం ఇవ్వాలని ఈసీకి సీఎం కేసీఆర్ లేఖ రాసిండు. సరే ఇచ్చుకోండి ఫర్వాలేదు అని వాళ్లు పర్మిషన్ ఇచ్చిన్రు. కానీ ఈ అడ్డమైన కాంగ్రెసోడు రేవంత్‌రెడ్డి.. రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కు లాభమైతది. ఎన్నికల్లో ఓట్లు వేస్తరు. దాన్ని ఆపాలే అని ఈసీకి లేఖ రాసి రైతుల నోటికాడి ముద్దను గుంజుకపోయిండు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ములుగు, చెన్నూరు, పెద్దపల్లి, ధర్మపురి, హుజూరాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థులు బడే నాగజ్యోతి, బాల్క సుమన్, దాసరి మనోహర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో, మంచిర్యాల జిల్లా చెన్నూరులో, పెద్దపల్లి నియోజకవర్గం సుల్తానాబాద్, ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్, హుజూరాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేటల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రైతులు, రైతుబిడ్డలు ఒక్కటే ఆలోచించాలె. ఇంకా నాలుగు ఓట్లు డబ్బాల పడకముందే రైతుల నోటికాడి ముద్దను గుంజుకున్న దౌర్భాగ్యపు పార్టీ కాంగ్రెస్. రేపు అవకాశం ఇస్తే రైతుబంధును ఉంచుతదా? 'తెలంగాణలో ఉన్నదంతా బీద, బిక్కి రైతులు.. వీళ్ల ముఖాలకు మూడు ఎకరాలకంటే ఎక్కువ లేదు. మూడు ఎకరాలకు మూడు గంటలు ఇస్తే చాలు. 10 హెచ్‌పీ మోటర్ పెట్టి గుంజుడు గుంజితే మూడు గంటల్లో పొలం పారుతది' అని రేవంత్‌రెడ్డి అంటున్నడు. మరి ఇక్కడికి వచ్చిన రైతుబిడ్డలు ఎవలకన్న 10 హెచ్‌పీ మోటర్ ఉన్నదా? 30న ఓటు బటన్ ఒత్తే ముందు ఒకటే ప్రశ్న మనసులో అడగండి. కరెంట్ కావాల్నా? కాంగ్రెస్ కావాల్నా? అని ఆలోచించుకోండి. ఎందుకంటే కరెంట్ కావాలంటే కాంగ్రెస్ ఉండదు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు' అని స్పష్టం చేశారు. రైతుబంధు ఇచ్చి కంటికి రెప్పలా కాపాడుకునే కేసీఆర్ కావాలా? రాబందుల్లా అన్నీ తన్నుకుపోయి, తీసేసి వేధించే కాంగ్రెస్ కావాలా? అన్నది ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కాటగలుస్తదని, రైతుబంధు తీసేస్తారని వెల్లడించారు.

### కాంగ్రెస్ రైతు భరోసా ఒక్కరికే

భూమి ఉన్న రైతుకు రైతుబంధు ఇస్తే, కౌలుదారుకు ఇయ్యనని.. కౌలుదారుకిస్తే రైతుకు ఇయ్యనని రేవంత్‌రెడ్డి అన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. కౌలు రైతుకే ఇస్తా అంటే ఎవరన్నా రైతుకు తమ భూమిని కౌలుకు ఇస్తరా? అన్నది ఆలోచించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆరే తెలంగాణకు రక్ష అని కేటీఆర్ స్పష్టం చేశారు. 'రైతుబంధు పెట్టిందెవరు? రైతుబీమా పెట్టిందెవరు? కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తెచ్చిందెవరు? 2వేల పింఛన్లు ఇచ్చిందెవరు? ఆడబిడ్డలకు కేసీఆర్ కిట్లు ఇస్తున్నదెవరు? ఇంటింటికీ నీళ్లిస్తున్నదెవరు?' అని అడిగి ప్రజల నుంచి సమాధానం చెప్పించారు. ఇన్నిజేసిన కేసీఆర్, కరెంటు మంచిగజేసి బతుకులు బాగుజేసిన కేసీఆర్, రైతును రాజు జేసిన కేసీఆర్‌తోనే రాష్ట్రం మరింత బాగుపడుతుందని తెలిపారు. 'రైతుకు మంచి చేస్తున్న ఒకే ఒక్క సీఎం కేసీఆర్. ఆయన బొండిగ పిసుకాల్నని ఢిల్లీ నుంచి మోదీ, అమిత్‌షా, యోగిలు, బోగిలు, 15 మంది ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాహుల్ గాంధీ, ఖర్గే, గిర్గేలు దిగుతున్నారు. ఇక్కడ ఉండే సన్నాసులతో ఊదు కాలదు. పీరు లేవదు' అని విమర్శించారు. 'ఇవాళ దేశంలో ఆడపిల్లలు మోదీని ప్రియమైన ప్రధానమంత్రి అంటలేరు. పిరమైన ప్రధానమంత్రి అంటున్నరు. అన్ని పిరం చేసి పిరమైన ప్రధానమంత్రి పార్టీకి ఒక్క ఓటు కూడా వేయకండి. ఆ ఒక్క ఓటు వేసినా మోరిలో పారేసినట్టే అవుతుంది. 3న మళ్లా గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీనే. వచ్చేది కేసీఆర్ సర్కారే' అని స్పష్టం చేశారు.



చెన్నూర్‌లోని రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్. చిత్రంలో చెన్నూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

### జనవరిలో కొత్త రేషన్‌కార్డులు

మూడోసారి అధికారంలోకి వచ్చాక జనవరిలో కొత్త రేషన్ కార్డులు, మ్యానిఫెస్టోలో పొందుపర్చిన ఆసరా పింఛను పెంపు, అన్నపూర్ణ పథకం కింద ప్రజలకు సన్నబియ్యం, రూ.400కే వంటగ్యాస్, సౌభాగ్యలక్ష్మి పథకం కింద 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలకు రూ.3 వేలు, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తామని కేటీఆర్ తెలిపారు. ఓట్ల లెక్కింపులో కారు గుర్తు దుమ్ములేపేలా 30వ తేదీన ఓట్లు గుద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, మాజీ మంత్రి బోడ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### కేటీఆర్ ట్వీట్ యథావిధిగా..

పంట పెట్టుబడి ఇస్తే కాంగ్రెసోళ్లకు కడుపుమంట ఎందుకు? ఎరువులకు, విత్తనాలకు పైసలిచ్చే రైతుబంధును బంద్ పెట్టిస్తున్నారెందుకు? ఎవుసం చేసే రైతులపైన పగ ఎందుకు? అన్నదాతకు సాయం అందకుండా అడ్డుపుల్లలు వేసి వికృతానందం పొందుతున్నారెందుకు? దుక్కిదున్నే బక్క రైతులపై ద్వేషం ఎందుకు? అన్నంపెట్టే రైతుల మీద అక్కసు ఎందుకు? కర్షకుడికి కడుపునిండా కరెంట్ ఇస్తుంటే చూసి ఓర్వలేని బుద్ధి ఎందుకు? 3 గంటల కరెంటే ఇస్తం..10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని మూర్ఖంగా ప్రకటిస్తున్నారెందుకు? రైతుచేనుకు రక్షణ కంచెగా ఉండే ధరణి మీద కక్ష ఎందుకు? దళారుల రాజ్యం తెచ్చి భూమేతకు అనుమతి ఇస్తామని నిస్సిగ్గుగా చెప్తున్నారెందుకు? కౌలు రైతులకు.. అసలు రైతులకు మధ్య అగ్గిపెట్టి భూములు పడావు పెట్టే ప్రమాదాన్ని తెస్తున్నారెందుకు? అన్నదాతలారా.. మీ వెన్నువిరిచే కాంగ్రెస్ కంత్రీ పాలసీలను జాగ్రత్తగా పరిశీలించండి! పండుగలా మారిన వ్యవసాయాన్ని మళ్లీ దండుగ చేసే దరిద్రపు రోజులు కావాలా? ఆలోచించండి! రైతుబంధువును ఆదరించండి..! రాబందులను తరిమికొట్టండి..!



చెన్నూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌తో కలిసి మంత్రి కేటీఆర్ పాల్గొన్న రోడ్ షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు

## కారు గుర్తుకు ఓటేసి తెలంగాణను గెలిపించండి

**ప్రజలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు విజ్ఞప్తి**

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి తెలంగాణను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు సోమవారం ఒక ఆడియో విడుదల చేశారు. 'పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం గడచిన పదేండ్లలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో గణనీయమైన అభివృద్ధిని సాధించిన విషయం మీ అందరికీ తెలిసిందే. వ్యవసాయం నుంచి ఐటీ వరకు, విద్య నుంచి వైద్యం వరకు, పల్లె నుంచి పట్నం వరకు తెలంగాణ రాష్ట్రం నేడు సమగ్ర, సమీకృత, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. దృఢమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వం ఉండబట్టే ఈ ప్రగతి సాధ్యమైంది. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మీ ఆశీర్వాదం, మీ అందరి సహకారం కావాలి. నవంబర్ 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును కారు గుర్తుకు వేయాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. కారు గుర్తుకు ఓటు వేయండి, తెలంగాణను గెలిపించండి.' అని పేర్కొన్నారు.

# గిగ్ వర్కర్ల సంక్షేమానికి బోర్డు

- కంపెనీలతో మాట్లాడి ఆరోగ్య బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు
- మంత్రి కే తారకరామారావు హామీ
- ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు: గిగ్ వర్కర్లు



మంత్రి కే తారకరామారావుతో గిగ్ వర్కర్లు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): స్విగ్గి, జొమాటో, ఓలా, ఉబెర్, ఇతర పార్ట్ టైం ఉద్యోగాలు చేసే గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. వారు సేవలు అందిస్తున్న కంపెనీలతో మాట్లాడి ఉద్యోగులకు ఆరోగ్య బీమా, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలను అందించడంతోపాటు జాబ్ సెక్యూరిటీని కల్పించేలా చూస్తామని భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన గిగ్ వర్కర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వారి సమస్యలు సావధానంగా విన్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 3 లక్షలకు పైగా యువకులు ఈ పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్న వీరి సంక్షేమాన్ని చూసుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు. అధికారంలోకి రాగానే గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు గిగ్ వర్కర్ల ప్రతినిధులతో కలిపి ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ బోర్డులో ఒక లీగల్ సెల్ వ్యవస్థతోపాటు యువకులకు కంపెనీల తరపున ఎదురయ్యే న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కొనేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం చేస్తున్న డెలివరీకి కొంత సొమ్ము అందుకొంటున్న పద్ధతితోపాటు వీరికి కనీస జీతాలను అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటాం: గిగ్ వర్కర్లు

తమ సమస్యలను గిగ్ వర్కర్లు మంత్రి కేటీఆర్ దృష్టికి తెచ్చారు. పలు కంపెనీలు తమకు అందించే ఫీజులను ఏమాత్రం పెంచడం లేదని, పైగా ఇన్సెంటివ్‌లను తీసివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కంపెనీ ప్రతినిధులతో తాను స్వయంగా మాట్లాడి సానుకూలంగా నిర్ణయం తీసుకొనేలా చర్యలు తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వమే స్వయంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ బుకింగ్, ఇతర ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన ఒక ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేస్తే తమకు ఉపయుక్తంగా ఉంటుందని గిగ్ వర్కర్లు తెలుపగా, ఈ ప్రతిపాదనపై కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. తమకు బతుకు భరోసా చూపిస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలుస్తామని గిగ్ వర్కర్లు ప్రకటించారు.



సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న విద్యార్థి ఉద్యమ నాయకుడు దరువు ఎల్లన్న. చిత్రంలో మానవతారాయ్, భాస్కర్.

# 4న కేటీఆర్‌తో కూర్చుందాం

- జాబ్ క్యాలెండర్ సిద్ధం చేయిద్దాం
- ఉద్యోగాల కోసం జైలుకెళ్లిన బిడ్డలుగా చెప్తున్నాం
- బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకుందాం
- మీడియాతో విద్యార్థి ఉద్యమ నాయకులు భాస్కర్, మానవతారాయ్, దరువు ఎల్లన్న

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ ఉద్యమ పునాదుల్లో ఒకటైన నియామకాల కోసం లాఠీదెబ్బలు తిన్న, జైలు కెళ్లిన విద్యార్థి ఉద్యమ నాయకులుగా చెప్తున్నాం.. డిసెంబర్ 4న మంత్రి కేటీఆర్‌తో కలిసి అశోక్‌నగర్‌లో కూర్చుందాం. జాబ్ క్యాలెండర్ సిద్ధం చేయిద్దాం. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్‌ను కాపాడుకుందాం' అని తెలంగాణ యువతకు విద్యార్థి ఉద్యమ నాయకులు భాస్కర్, మానవతారాయ్, దరువు ఎల్లన్న పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణభవన్‌లో భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాకతో విద్య, వైద్య, వ్యవసాయం, సంక్షేమం, ఐటీ రంగాల్లో సమూల మార్పులొచ్చాయని వివరించారు. నిరుద్యోగాన్ని పారదోలేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నదని, ప్రైవేట్ సెక్టార్‌లో లక్షల ఉద్యోగాలు కల్పించిందని వివరించారు. దేశంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ.. తొమ్మిదేండ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చిందో కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన యూనివర్సిటీల విద్యార్థులను తాగుబోతులు, అడ్డామీద కూలీలతో రేవంత్‌రెడ్డి పోల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మన పోరాటం రాకాసుల పాలుకావొద్దు

కాంగ్రెస్ హయాంలో ఉద్యోగాలు అడిగితే కేసులు బనాయించి, జైల్లో పెట్టారని, కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షా 60 వేలకుపైగా ఉద్యోగాలు ఇచ్చిందని దరువు ఎల్లన్న చెప్పారు. మన పోరాటం రాకాసుల పాలు కావొద్దని పిలుపునిచ్చారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన రాహుల్ గాంధీ.. ఆరునెలలు గడుస్తున్నా రెండు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని మానవతారాయ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ భర్తీ చేసిన ఉద్యోగాలపై దమ్ముంటే కోదండరామ్, రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు.

### లోకం పోకడ




మనం 'ధరణి' తీసేసి 'దళారి' తెద్దాం!

## జేఈఈ మెయిన్‌కు ఎల్లుండే ఆఖరు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ దరఖాస్తుల గడువు ఈ నెల 30తో ముగియనున్నది. జేఈఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. తుది గడువు సమీపిస్తుండటంతో, దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయి. డిసెంబర్ మొదటి వారంలో ఎడిట్ ఆప్షన్, అడ్మిట్‌కార్డులను పరీక్షకు మూడు వారాల ముందుగా విడుదల చేస్తారు. మెయిన్ పరీక్షను జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వరకు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు 10 లక్షల వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 17.8°c | 32.5°c |
| నల్లగొండ | 19.0°c | 32.2°c |
| మెదక్ | 20.1°c | 28.3°c |
| ఆదిలాబాద్ | 20.1°c | 33.3°c |
| వరంగల్ | 21.0°c | 30.0°c |
| కరీంనగర్ | 21.0°c | 31.0°c |
| మహబూబ్‌నగర్ | 21.3°c | 29.4°c |
| నిజామాబాద్ | 21.3°c | 31.3°c |
| హైదరాబాద్ | 21.6°c | 29.2°c |
| ఖమ్మం | 22.0°c | 30.0°c |

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్‌లో...

**స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ (ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు: నర్సింగ్ సిస్టర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, కుక్, ప్లాస్టర్ టెక్నీషియన్, టైపిస్ట్/క్లర్క్ తదితరాలు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 27
- వెబ్‌సైట్: https://svnirtar.nic.in

### ఏఐ ఇంజినీరింగ్‌లో...

**ఏఐ ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 52
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్, ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్
- విభాగాలు: ఫైనాన్స్, హెచ్‌ఆర్, ఎంఎం, ఐఆర్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: నవంబర్ 28
- వెబ్‌సైట్: https://aiesl.in

### ఆర్మీలో ఆఫీసర్లు

**టెరిటోరియల్ ఆర్మీలో ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: ఆఫీసర్ (సివిలియన్– పార్ట్ టైం)
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 19
- వెబ్‌సైట్: www.jointterritorialarmy.gov.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, పాలిటీ, జువాలజీ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.